# నేరము శిక్ష

**స్వప్నకు తన చిరకాల స్వప్నం సాకారమైనందుకు చాలా ఆనందంగా వుంది. జరిగిందంతా కలా నిజమా అన్న సందిగ్ధంలో నుంచి ఇంకా తేరుకోలేకపోతోంది.**

**ఆమెకు యుక్త వయసు వచ్చినప్పటి నుంచి పెళ్లంటూ చేసుకుంటే ఎన్ఆర్ఐని చేసుకోవాలని వుండేది. అందుకు తగ్గట్టుగానే స్వప్న తల్లిదండ్రులు కూడా ఆమె కోరికను పెంచి పోషించారు.**

# యన్ ఆర్ ఐ

## ఆదిత్య

విదేశీ అల్లుడైతే సొసైటీలో తమకు హోదా పెరుగుతుందని భావించారు. ఇంటర్నెట్ ద్వారా తరుణ్‌రాయ్ గురించి వివరాలు సేకరించారు స్వప్న తండ్రి శ్రీవాత్సవ్, తల్లి రమాదేవిలు. రెండు రోజుల్లో తరుణ్ తన తల్లిదండ్రులు సురేందర్, సీమారాయ్‌లతో పెళ్లిచూపులకొచ్చాడు. స్వప్న అందం అతన్ని పిచ్చివాడిని చేసింది. కట్నంగా కేవలం బంగారాన్నే కోరారు వారు. కూతురి కోసం అంగీకరించారు. రెండు వారాల్లో అతను కెనడా తిరిగి వెళ్లాల్సి వుందని, ఆఘమేఘాల మీద పెళ్లి జరిపించారు.

మల్లెపూల పందిరి మంచం మీద మేలిముసుగుతో దీర్ఘాలోచనలో వున్న స్వప్న ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తున్నట్లుగా తరుణ్ అడుగుల చప్పుడు వినగానే బెదురు చూపులతో అతన్ని తేరిపార చూసింది.

తరుణ్ చూపులు ఆమెను కొరుక్కుతినేలాగున్నాయి... ''ఏంటా చూపు..?'' బెరుగ్గా అంది స్వప్న.

''నిజం చెప్పనా... ఇంత అందం నా స్వంతం చేసుకోబోతున్న నేనెంత అదృష్టవంతుడినో కదా...''

''నువ్వే కాదు నేనూ అదృష్టవంతురాల్ని... ఎన్ఆర్ఐ మొగుడు కావాలని దేవుడిని ఎంతలా వేడుకున్నానో...''

''ఊహూ...'' అంటూ స్వప్నను మీదకు లాక్కున్నాడు తరుణ్. ఆ కౌగిలి కొత్తగా వింతగానూ వుంది స్వప్నకు.

స్వప్న బుగ్గలపై సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు. స్వప్న సిగ్గుతో ''అబ్బా...లైటు తియ్యండి...'అంది.

''పిచ్చి స్వప్నా.... ఇక్కడ వున్నది మనమిద్దరమే. మూడో మనిషి లేడు. అంత మాత్రానికే ఇంత సిగ్గా... ఇదే కెనడాలో అయితే పట్టపగలు పదిమంది మధ్యలో వున్నా నిస్సంకోచంగా ఇలా ముద్దు పెట్టుకుంటారు...'' అంటూ స్వప్న పెదాలను తన పెదాలతో మూసాడు.

ఆ మరుక్షణమే లైటారిపోయింది.

★★★

ఇంటి ముంగిట టాక్సీ ఆగి వుంది. సూట్‌కేసులు ఒక్కొక్కటే అందులోకి చేరుస్తున్నారు.

తల్లిదండ్రులను వదిలి వెళుతున్నందుకు మనసులో దిగులుగా వున్నా కెనడా వెళుతున్నానన్న ఆనందం స్వప్నను నిలవనీయడం లేదు. కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతోంది.

శ్రీవాత్సవ్, రమాదేవిలు కూడా కూతురు సుదూర తీరాలకు వెళ్లిపోతున్నా సుఖంగా వుంటే చాలనుకొని గుండెదిటవు చేసుకున్నారు. టాక్సీ ఎక్కుతూ గబుక్కున తల్లిని వాటేసుకొని చిన్న పిల్లలా బావురుమంది స్వప్న.

తరుణ్ ఓదారుస్తూ... ''వీలున్నపుడల్లా ఫోన్ చేస్తుంటాం... ఓ ఆర్నెల్ల తరువాత మీకూ టిక్కెట్ పంపిస్తాను. పాస్‌పోర్టు తీసుంచండి...'' అనడంతో అల్లుడి ఔదార్యానికి మురిసిపోయారు వృద్ధ దంపతులు.

టాక్సీ కనుచూపు మేర దాటేవరకు చెయ్యి ఊపుతూనే వున్నారు వాళ్లు.

★★★

మరునాడు స్వప్న ఫోన్ చేసింది. ''డాడీ ముంబాయి క్షేమంగా చేరాం. రాత్రి ఫ్లైట్‌కి కెనడా

వెళ్లిపోతున్నాం...'' అంటూ సంతోషంగా చెప్పింది.

ఆ తరువాత నెలరోజుల వరకూ స్వప్న గురించి ఎలాంటి సమాచారం రాలేదు. శ్రీవాత్సవ్ దంపతులు ఆందోళనకు గురవుతున్న సమయంలో ఫోన్ మోగింది.

ఫోన్ అందుకున్న రమాదేవి ''హలో...'' అంది.

అవతలి వైపు నుంచి ''అమ్మా...''అన్న స్వరం వినిపించగానే ఆ తల్లిదండ్రుల మనసు ఆనందంతో గంతులేసింది.

''ఎలాగున్నావమ్మా...'' గద్గద స్వరంతో అడిగింది.

''నే బాగానే వున్నానమ్మా...''స్వప్న మాట పూర్తికాకుండానే ఫోన్ గుర్రు...గుర్రు...మన్న శబ్దాలు వినిపించాయి. లైన్ కట్ అయింది.

పోనీలే అమ్మాయి క్షేమంగా వుంది కదా అని తృప్తిపడ్డారు.

★★★

ఆరు నెలల వరకూ తరుణ్ నుంచి ఫోన్ రాలేదు. లాభం లేదనుకొని తనే ఫోన్ చేసాడు శ్రీవాత్సవ్. అటు నుంచి ఎలాంటి సమాధానం లేదు.

పోనీ తరుణ్ తల్లిదండ్రులు సురేందర్‌రాయ్ నెంబరుకు ఫోన్ చేశాడు. ఎలాంటి స్పందన లేదు.

ఏం చేయాలో తోచలేదు వాళ్లకు.

అలాంటి సమయంలో స్వప్న స్నేహితురాలు షఫాలి వాళ్లింటికి వచ్చింది. వస్తూనే... ''సారీ ఆంటీ స్వప్న పెళ్లికి రాలేక పోయాను...సెలవు దొరకలేదు... ఇప్పుడెలా వుంది తనూ...'' అంటూ గలగలా మాట్లాడుతున్న షఫాలీని చూస్తే వాళ్లకు కొంత ఊరట కలిగింది.

స్వప్న కెనడాలో వుంటోందని తెలిపారు.

''అలాగా నాకు చాలా సంతోషంగా వుంది ఆంటీ...అన్నట్లు చెప్పడం మరిచా... మరో నాలుగు రోజుల్లో నాకు పెళ్లి చూపులు ఏర్పాటు చేసారు. మీరిద్దరూ తప్పకుండా రావాలి...''అంటూ వాళ్లిద్దరినీ ఆహ్వానించింది షఫాలి.

''మా ఇద్దరి ఆరోగ్యం అంతంత మాత్రమే. పెళ్లి కుదిరితే తప్పకుండా వస్తాం. మా ఆశీస్సులు ఎల్లప్పుడూ వుంటాయి. వీలును బట్టి వస్తాం...''అన్నాడు శ్రీవాత్సవ్.

''మీ ఇష్టం అంకుల్...''అని సెలవు తీసుకొంది షఫాలి.

యథాప్రకారం స్వప్న సమాచారం ఏమీ తెలియలేదు ఆ దంపతులకు.

★★★

వారం రోజుల అనంతరం షఫాలి సంతోషంగా వచ్చింది. రమాదేవికి స్వీట్ అందిస్తూ..

''ఆంటీ నా పెళ్లి నిశ్చయమయ్యింది.'' అంది సంతోషంగా.

''చాలా సంతోషం. అబ్బాయి ఎవరమ్మా...?'' అడిగాడు శ్రీవాత్సవ్.

''అతని పేరు సంజయ్. న్యూయార్క్‌లో పనిచేస్తున్నాడు... మీకు చూపిద్దామని ఫోటో కూడా తెచ్చాను...''అంటూ కవర్‌లో నుంచి ఓ ఫోటో తీసి అందించింది.

ఆ ఫోటో చూస్తూనే ఆ వృద్ధ దంపతుల నెత్తిన పిడుగుపడ్డట్లయింది. రమాదేవి అయితే పక్కనున్న సోఫాలో కూలబడింది.

''అయ్యో ఆంటీ... ఏం జరిగింది?''అంటూ గ్లాసులో నీళ్లు తీసుకొచ్చి అందించింది.

మంచినీళ్లు గటగటా తాగిన తరువాత తేరుకుంది రమాదేవి.


''ఏం జరిగిందంకుల్...?'' మళ్లీ అడిగింది షఫాలి.

★★★

పెళ్లికొడుకు సంజయ్ తల్లిదండ్రులు వీరేందర్, సులోచనలు డాబుసరిగా షఫాలి ఇంటికి చేరుకున్నారు. మరో నాలుగు రోజుల్లో పెళ్లి ముహూర్తం వుంది. పెళ్లికూతురుకు పెట్టనున్న బంగారు నగల నాణ్యతను పరీక్షిస్తామన్నారు. వాళ్ల ప్రవర్తన అవమానకరంగా వుంది షఫాలి తండ్రి బహదూర్ సింగ్‌కు. అయినా కూతురి సుఖం కోరి నగల పరీక్షకు అంగీకరించాడు. వాళ్ల వెంట ఓ నగలను పరీక్షించే వ్యక్తి కూడా వచ్చాడు.

బహదూర్ సింగ్ అందించిన నగలన్నింటినీ గుచ్చి గుచ్చి పరీక్షిస్తున్నాడు అతడు. ప్రతిదీ నాసిరకంగా వున్నాయంటూ వంకలు పెడుతున్నాడు. సంజయ్ తల్లి నొసలు చిట్లిస్తూ....''ఛీ...ఛీ.. మీరు ఇంత చవకరకం మనుషులనుకోలేదు... బరోడాలో మా అబ్బాయికి పాతికలక్షలిస్తామని వచ్చారు...'' అంటూ దీర్ఘాలు తీయసాగింది.

ఈ తతంగం జరుగుతున్నప్పుడే షఫాలి



అక్కడకు చేరుకుంది. షఫాలిని చూస్తూనే మొహం చాటంత చేసుకుంది సంజయ్ తల్లి సులోచన.

''ఆజా...బేటీ....సంజయ్ నిన్ను చూస్తానని ఒక్కటే కలవరింత....మాక్కూడా ఎప్పుడెప్పుడు నిన్ను మా ఇంటికి తీసుకెళ్లాలా అని తహతహగా వుంది....'' అంది.

''నన్ను చూడాలనుకోవడం బాగానే వుంది... కానీ మరి ఈ నగల పరీక్ష ఏమిటి?''

''అది...అది... మా ఆచారం...'' అన్నాడు వీరేందర్.

షఫాలి మనసు కుతకుత ఉడికిపోతోంది. అయినా సహనంగా వుండిపోయింది.

అన్ని నగల్ని గీసిగీసి పరీక్షిస్తున్నారు. ఇంతలో ఏదో గుర్తుకు వచ్చింది షఫాలికి. వేలికున్న ఉంగరాన్ని తీసి ''దీన్ని కూడా పరీక్షించండి...'' అంటూ ముందుకు తోసింది.

''అయ్యో...అయ్యో.... అపచారం... అది మేం పెట్టింది కదా... మా నగల్ని కూడా పరీక్షిస్తావా...?'' అంటూ బుగ్గలు నొక్కుకున్నారు సంజయ్ తల్లిదండ్రులు.

''మా నాన్న పెట్టిన నగలు అంత కచ్చితంగా పరీక్షిస్తుంటే...మీరు పెట్టిన నగలు పరీక్షిస్తే తప్పేమిటి?'' అని షఫాలి నిలదీయడంతో వెనక్కు తగ్గారు.

షఫాలి వేలికున్న ఉంగరాన్ని పరీక్షించసాగాడు. వాళ్లంతా ఉత్కంఠంగా చూడసాగారు. ఆ ఉంగరాన్ని పరీక్షించి నకిలీదని తేల్చేసాడు ఆ పెద్దమనిషి. ఆ ముగ్గురు మొహాలు వెలవెలపోయాయి. షఫాలి ఆ ఉంగరాన్ని తీసి సంజయ్ మొహాన విసిరికొట్టింది.

''నాన్నా.... ఈ ఉంగరమే కాదు... ఈ పెళ్లికొడుకు కూడా నకిలీ...'' ఆవేశంగా అనేసరికి...

అక్కడున్న ముగ్గురూ విస్తుపోయారు. అయినా సంజయ్ బింకంగా '' ఏం కూస్తున్నావ్...మమ్మల్ని నకిలీలంటావా...'' కోపంగా అనేసరికి...

''ఆ విషయం తేల్చడానికి మేం వచ్చాం..'' అంటూ పోలీసుల్తో శ్రీవాత్సవ్, రమాదేవిలు అక్కడ చేరుకున్నారు.

ఎస్ఐ మహేష్ పటేల్.. ''మిస్టర్ సంజయ్ ఉరఫ్ తరుణ్ నీ నకిలీ రంగు ఇంత త్వరగా బయటపడుతుందనుకోలేదు కదూ... అసలు ఈ ముసలాళ్లిద్దరూ నీ తల్లిదండ్రులు కాదు. మీదంతా ఓ ముఠా. నీ ఫోటో చూసి షాక్ అయ్యారు స్వప్న తల్లిదండ్రులు. ఎన్ఆర్ఐలు అల్లుళ్లు, మొగుళ్లు కావాలనుకునే అమాయకులను మీ మాయ మాటల్తో బోల్తా కొట్టించి పెళ్లి చేసుకొని ముంబాయి తీసుకెళ్లి వ్యభిచార కూపంలోకి తోస్తూ, కాదన్న వారి ఉసురు తీస్తున్నారు. షఫాలి, స్వప్న స్నేహితులవడం వల్ల నీ మీద కంప్లయింట్ ఇచ్చింది... ఇప్పుడు చెప్పు స్వప్నను ఏం చేసావు?'' అంటూ గద్దించేసరికి-


''స్వప్న ఈ లోకాన్ని వదిలి వెళ్లిపోయింది...'' అని సంజయ్ చెప్పేసరికి శ్రీవాత్సవ్, రమాదేవిలు గొల్లుమన్నారు.

''నా కూతురి ఉసురు తీసిన ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేయండి...'' శ్రీవాత్సవ్ ఆవేశంగా అనేసరికి...

స్వప్న లాంటి ఎంతో మంది అమాయకులను విదేశీ అల్లుడి వేషంతో మోసం చేసిన తరుణ్‌ను, అతని తల్లిదండ్రులుగా నటించిన సురేందర్, సీమారాయ్‌లను ముగ్గురినీ అరెస్ట్ చేసి కటకటాల వెనక తోసారు. కేసు విచారణలో వుంది.

షఫాలిని అక్కున చేర్చుకున్నారు శ్రీవాత్సవ్, రమాదేవిలు.

★




## గంట

అవి అమెరికాలోని గోల్డ్‌రష్ రోజులు.

కాలిఫోర్నియాలోని ఓ కొండ ప్రాంతంలోని బంగారు గనుల్లో బంగారం విరివిగా దొరుకుతోందన్న సంగతి అమెరికా అంతటా పాకిపోవడంతో అనేక వేల మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి వచ్చారు.

వారిలో ఇద్దరి పేర్లు సేమ్, బిల్.

వారు నిత్యం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం దాకా నేలని తవ్వుతూ, మట్టిని జల్లెడ పట్టి బంగారం దొరుకుతుందే మోనని ఆశగా అన్వేషించసాగారు. అదృష్టం వాళ్లని పెద్దగా వరించలేదు. తీక్షణమైన ఎండలో మాడుతూ ఇద్దరూ ఆశ వదలక భూమిని తవ్వి బంగారం కోసం శోధించసాగారు. వారం...నెల..రెండు నెలలు గడిచాయి. వారికి బంగారం లభ్యం కాలేదు.

విసిగిపోయిన సేమ్ ఓ రోజు గడ్డపారని, పలుగుని పారేసి బిల్‌తో చెప్పాడు.

''ఇదంతా అనవసరపు శ్రమ పోదాం పద''

''అనేక మందికి బంగారం దొరికింది కదా? ఇంకొంతకాలం ప్రయత్నిద్దాం'' చెప్పాడు బిల్.

బిల్ ఎంత నచ్చజెప్పినా సేమ్ వినలేదు.

''నువ్వుంటే వుండి ప్రయత్నించు. నేను వెళతాను'' చెప్పి సేమ్ వెళ్లిపోయాడు.

అతను వెళ్లిన గంటకే బిల్ పారతో మట్టిని తీస్తే, కింద తళతళ మెరిసే మట్టిపొర కనిపించింది. గబగబ తవ్వితే చిట్టచివరికి బంగారం దొరికింది. తన మిత్రుడు సేమ్ గంట వ్యవధిలో ఐశ్వర్యాన్ని కోల్పోయాడు అనుకున్నాడు బిల్. బిల్ కోటీశ్వరుడయ్యాడు. అంతేకాదు. సేమ్ కూడా.

సేమ్ బంగారాన్ని మట్టి కింద నుంచి కాక మాటల చాటునుంచి సంపాదించాడు. సేమ్యూల్ లాంగ్ హార్న్ క్లైమెన్స్ 'మార్క్ ట్వెయిన్' అనే కలం పేరుతో ఈ నాటికి పాఠకులకు వినోదాన్ని అందించే విలువైన రచనలని అందించి ఎంతో ధనం పేరు ఆర్జించాడు. సేమ్ వెళ్లడం ఒక్క గంట ఆలస్యం చేసి వుంటే బహుశా పాఠలోకం చక్కటి రచనలని కోల్పోయి వుండేది.

**-మల్లాది**